# ప్రేమంటే ఇదే !

తెల్లవారుజామున ఐదింటికే మెలుకువ వొచ్చింది అనీష్‌కు. రోజూ ఏడింటికిగాని నిద్రలేవడు.

అనసూయ అప్పటికే వాకిలి ఊడ్వడం, నీళ్లు చల్లి ముగ్గులెయ్యడం పూర్తయ్యింది. రాఘువ ఆసనాలు వెయ్యడం పూర్తిచేసి, క్యాన్ పట్టుకుని దగ్గర్లో వున్న సాహిబ్‌నగర్‌కు వెళ్ళాడు. డైరీఫాం దగ్గర తీసిన పాలు తీసినట్లుగా రెండు లీటర్లు తెచ్చుకుంటాడు. ప్యాకెట్ పాలు నచ్చవు.

... అమ్మనాన్నల దినచర్య ఉదయంపూట అలా మొదలవుతుంది. చిన్నప్పటి నుంచి చూస్తూనే వున్నాడు. వాళ్ళిద్దరి రోజువారి కార్యక్రమాల్లో ఏ మార్పు ఉండదు. అమ్మ అంట్లు తోమి వొచ్చేసరికి నాన్న కాఫీ కలిపి అమ్మకో కప్పు ఇస్తాడు. వాళ్ళిద్దరూ మాట్లాడుకోవడం, ఏ విషయమన్నా చర్చించుకోవడం, పెద్దగా కేకలు వెయ్యడం ఎప్పుడూ గమనించలేదు అనీష్.

... నాన్న తొమ్మిది గంటలకన్నా స్నానం, భోజనంచెయ్యడం ముగించుకుని బ్యాగ్‌లో టిఫెన్ బాక్సు, వాటర్ బాటిల్ పెట్టుకుని బయల్దేరాడు. వో పది నిముషాలు అందరికన్నా ముందు వెళ్ళి క్యూలో నిలబడతాడు బస్సులో సీటుకోసం. వనస్థలిపురం నుంచి సచివాలయందాకా బస్సులో తొక్కిసలాటలో నిలబడాలంటే కష్టం. అమ్మ ఇంటి పనిలో మునిగిపోతుంది. సాయంత్రం ఆరుగంటలకు నాన్న ఆఫీసు నుంచి తిరిగి వొస్తాడు. అమ్మ టీ కప్పు అందిస్తుంది. నాన్న టీ చప్పరిస్తూ ఆఫీసు కబుర్లు చెప్పడం, అమ్మ కాలనీలో చుట్టుప్రక్కల వాళ్ళ సంగతులు పూసగుచ్చినట్లు చెప్పడం ఉండదు. మౌనంగా ఇంటి ముందున్న పూల మొక్కలకేసి చూస్తూ టీ తాగేస్తాడు నాన్న...

... నాన్న మేనరికం కాదనుకుని పక్క వీధిలోని అమ్మాయి అంటే ఇష్టపడి

పెళ్ళిచేసుకున్నాడు. ఆ అమ్మాయి తనతోపాటే పదోతరగతి వరకు చదివింది. వాళ్ళింటి ముందు నుంచి నడిచి వెళ్తూ ఆ అమ్మాయి కన్పిస్తుందేమోనని తలెత్తి చూసేవాడు నాన్న. అమ్మ కన్పించగానే మళ్ళీ తలదించుకునేవాడు. డిగ్రీ పూర్తిచేసి సర్వీస్ కమీషన్ పరీక్షల్లో ఉత్తీర్ణుడై సచివాలయంలో ఉద్యోగం సంపాదించాడు. అప్పుడు ధైర్యంచేసి అనసూయను పెళ్ళిచేసుకుంటానని ఇంట్లో చెప్పేశాడు. అదీ అమ్మ నాన్నల ప్రేమకథ...

పార్కుల్లో కలవడం, పెళ్ళికి ముందు మాట్లాడుకోవడం, లవ్‌లెటర్స్ రాయడం అవేవీ లేదు. అమ్మవైపు ఆరాధనగా చూస్తూ ప్రేమను వ్యక్తపరిచేవాడట నాన్న. తనవైపు చూసేసరికి సిగ్గుతో మెలికలు తిరిగేదట అమ్మ. ఎప్పుడో గుచ్చి, గుచ్చి అడిగితే కొడుక్కి ఆ వివరాలు చెప్పింది. అమ్మ అయితే చెప్పిందిగాని వాళ్ళది ప్రేమ వివాహమని అనీష్ నమ్మలేదు. వాళ్ళిద్దరికి ప్రేమించే హృదయం ఉందానని అనుమానమొచ్చేది. యంత్రాల్లా పనిచేసుకుపోవడం తప్పితే ప్రేమకురిపిస్తూ మాట్లాడుకోవడం ఎప్పుడూ చూడ్లేదు.

వాళ్ళిద్దరిని చాటుగా గమనించే ప్రయత్నంకూడా అనీష్ చేశాడు. ప్రేమ వ్యక్తపరుస్తూ నాన్న మురిపెంగా మాట్లాడుతాడేమో, అమ్మ భుజంమీద చెయ్యివేసి లాలనగా ఆమెవైపు చూస్తాడేమో, నవ్వుతూ వాళ్ళిద్దరు మాట్లాడుకుంటారేమోనని వెయ్యికళ్ళతో ఎదురుచూసేవాడు.

ఆర్థికపరమైన ఒడిదుడుకులు లేకుండా సంసారం నెట్టుకురావడం, కొడుకుని ఇంజనీరు చెయ్యడం- అవే వాళ్ళ లక్ష్యాలు. చదువు విషయంలో అనీష్ మీద ఎప్పుడూ ఒత్తిడి తీసుకువొచ్చేవాళ్లు కాదు.

ఎన్నో ఇబ్బందులు పడి అనీష్‌ను ఇంజనీరింగ్ వరకు చదివించేరు. తిండికి బట్టకు తప్పితే విలాసాలకు ఖర్చుపెట్టేవాడుకాదు రాఘవ. కొత్త చీరలు నగలు కొని పెట్టమని భర్తను సతాయించేది కాదు అనసూయ. ఉన్నవాటితోనే సర్దుకుపోయే వాళ్ళు. చిన్న ఇంటిని అందాల పొదరిల్లులా తీర్చిదిద్దుకున్నారుగాని పెద్ద భవనం కట్టుకోవాలనే ఆశతో అడ్డదార్లు తొక్కి అక్రమ సంపాదన జోలికిపోలేదు.

ఒకరినొకరు అర్థంచేసుకునే ప్రయత్నం చేసేవాళ్ళేగాని కోపతాపాలకు తావుండేది కాదు.

ఎనిమిదింటికల్లా స్నానంచేసి బయటకు వెళ్ళడానికి సిద్ధమవుతున్న అనీష్‌కు ఉప్మాప్లేటు అందించింది అనసూయ.

"ఆఫీసుకు తొందరగా వెళ్ళాలా? ఎనిమిదింటికి తయారయ్యావ్?" అందామె.

తల్లివైపు నవ్వుతూ చూస్తూ "ఈరోజు 'వాలెంటైన్స్‌డే' మమ్మీ! వసుధను కలువడానికి వెళ్తున్నాను. ఆఫీసుకు వెళ్ళడంలేదు.... భోజనానికి ఇంటికి రాను. మార్నింగ్‌షో, హోటల్లో భోజనం సాయంత్రం దుర్గంచెరువు దగ్గర వసుధతో విహారం-రాత్రికి రిసార్ట్‌లో మకాం. రేపుఉదయం ఇంటికి తిరిగివొస్తాను. అన్నిఏర్పాట్లు వసుధే చేసింది" చెప్పుకుపోయాడు అనీష్.

వసుధ గురించి తల్లిదండ్రులకు ఆరునెలల క్రిందటే తెలుసు. నగరంలో పెద్ద కాంట్రాక్టర్ కూతురు. ఆస్తిపాస్తులకు కొదవలేదు. అనీష్ పనిచేసే సాఫ్టవేర్ కంపెనీలోనే ఆ అమ్మాయి కూడా పనిచేస్తూ వుంది. రెండు మూడుసార్లు ఆ అమ్మాయిని ఇంటికి తీసుకువచ్చి తల్లిదండ్రులకు పరిచయం చేశాడు.

అనసూయకు వసుధ అందచందాలు నచ్చాయిగాని ఆ అమ్మాయి అభిరుచులు నచ్చలేదు. కార్లో అనీష్‌ను ప్రక్కన కూర్చోబెట్టుకుని లాంగ్‌డ్రైవ్‌కు వెళ్ళడం, రాత్రిళ్ళు పబ్‌లకు వెళ్ళడం, డ్యాన్స్‌లు వెయ్యడం నచ్చేవి కావు. ఇంటికి వొచ్చినప్పుడు ఏంచేసిపెట్టినా 'ఇవి నాకు నచ్చవ్ ఆంటీ! మా ఇంట్లో దోశెలు, అరిసెలు, చక్కిరాలు, సున్ని ఉండలు తినరు... నాకు వొద్దు!' అనడంతో అనసూయ చిన్నబుచ్చుకునేది.

"వసుధకు ఏం ప్రెజెంటేషన్ కొనమంటావ్ మమ్మీ?" తల్లిని అడిగాడు.

"మన దొడ్లో సంపెంగలు విరగబూసాయి. అరిటాకులో వో పదిపూలు తీసుకెళ్ళు.. సంపెంగ వాసనలు చుట్టుముట్టెస్తే ఆ అమ్మాయి సంతోషపడుతుంది" అందామె.

అతనికి ఏదో అనుమానం వొచ్చింది.

"మమ్మీ! నాన్న నువ్వంటే ఇష్టపడి కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నాడు కదా! మీరిద్దరూ ప్రేమికులే! కానీ ఎప్పుడూ కనీసం మ్యారేజ్‌డే కూడా సెలబ్రేట్ చేసుకున్నట్లు కన్పించరు.... వాలెంటైన్స్‌డే ఎప్పుడన్నా ఇష్టంగా జరుపుకున్నారా?" అడిగాడు తల్లిని.

కొడుకు బుగ్గలు నిమిరింది.

"వయస్సులో ఉన్నప్పుడు వాలెంటైన్స్‌డేగూర్చి మీ నాన్న చెపితే విన్నానుగాని ఆ రోజుల్లో ఎవరూ ప్రత్యేకంగా జరిపేవాళ్ళు కాదు. ఇప్పటి యువతరం ఇష్టంగా జరుపుకుంటున్నారు. ప్రేమికులుజంటలుగా వాలెంటైన్స్‌డేనాడు ఏకాంతంలో మనసువిప్పి మాట్లాడుకోవడం, ముద్దు మురిపాలతో మురిసిపోవడంతో తప్పులేదు. విద్వేషంలో ఇతరుల మీద కత్తులు దుయ్యడం తప్పుకాని, ప్రేమికులు ఆనందంగా గడపడంలో తప్పేముంది?"

అంది అనసూయ. అమ్మకు స్పష్టమైన అవగాహన వుందనుకున్నాడు. రోజూ ఆమె దినపత్రికలు వారపత్రికలు తిరగేస్తుంది తీరిక సమయాల్లో, నాన్న క్రికెట్ ఆడడుగాని టివిలో క్రికెట్ పోటీలు చూస్తూవుంటాడు. క్రికెట్ గూర్చి ఎవరన్నా మాట్లాడుతూ వుంటే ఆసక్తిగా వుంటాడు.

"నాన్న నీకు ఎప్పుడన్నా గిఫ్టెచ్చి ఇచ్చారా?" మరో ప్రశ్న తల్లిని అడిగాడు.

"నిజమైన ప్రేమ బహుమతులు కోరదు... ప్రేమకు స్వార్థం ఉండదు. ప్రేమికుల్లా మొదట కన్పించిన ఉత్సాహం జీవిత చివరి అంకంలో చివరి మజిలీలో కూడా కన్పించాలి. ఆకుపచ్చగా నిరంతరం ఉండిపోవాలి. ముసలితనంలో కూడా ఆకుపచ్చ జ్ఞాపకంలో మిగిలిపోవాలి" అందామె.

❖ ❖ ❖

అమ్మచెప్పినట్లే సంపెంగ పూలు తీసుకుని వసుధ దగ్గరకు వెళ్ళాడు అనీష్ మోటర్‌బైక్ మీద.

సంపెంగపూలు ఆమెకు ఇచ్చాడు వాళ్ళింటికి వెళ్ళగానే.

"సంపెంగ పూలవాసన నాకు పడదు" అంది వసుధపూలు పక్కనపెట్టేస్తూ.

నొచ్చుకున్నాడతను. మొహంమీదే అలా అనకుండా వుంటే బాగుండేదనుకున్నాడు.

"నీ బైక్‌మీద సిటీఅంతా తిరుగుదాం" అంది వసుధ బైక్‌మీద అతని వెనక కూర్చుంటూ.

నెక్లెస్ రోడ్డుమీదుగా ప్రసాద్ ఐమాక్స్ వైపు బైకు స్పీడుగా నడిపాడు. "ఓల్డ్‌మాన్ నడిపినట్లు స్లోగా పోతున్నావేమిటీ? స్పీడ్ పెంచు" అందామె.

మరింత వేగం పెంచాడు.

అతని ఛాతీ చుట్టూ చేతులు బిగించి, అతనిని మరింత హత్తుకుపోయింది.

"నిన్ను 'బాయ్‌ఫ్రెండ్‌గానే ఉండనీ... లైఫ్‌పార్ట్‌నర్‌గా మాత్రం సెలెక్ట్ చేసుకోకు...' అని మా నాన్న నా చెవిలో నూరిపోస్తున్నాడు" అందామె అతని చెవి దగ్గర మూతి పెట్టి.

అతనిలో అలజడి మొదలయ్యింది.

ఎవరో వసుధకు ఫోన్‌చేశారు. సెల్‌ఫోన్ చెవి దగ్గర ఉంచుకుని మాట్లాడింది రెండు క్షణాలు. "కాలేజీలో నా క్లాస్‌మెట్... నన్ను ప్రేమిస్తున్నాడట... వాలెంటైన్స్ గ్రీటింగ్స్ చెబుతున్నాడు... నువ్వు సమాధానం ఇవ్వు!" అంటూ సెల్‌ఫోన్ అనీష్ చెవి దగ్గర ఉంచింది.

ఎదురుగా వో చిన్నకుర్రాడు సైకిల్ నడిపించుకుంటూ రోడ్డుక్రాస్ చేస్తున్నాడు. ఆ కుర్రాడిని తప్పించబోయి బ్యాలెన్స్ తప్పి కారుకు గుద్దేశాడు బ్రేక్‌ను.

"హీరోలా అమ్మాయిని వెనుక కూర్చోబెట్టుకుని బైక్ స్పీడ్‌గా నడపడం... పైగా సెల్‌ఫోన్‌లో బైక్ నడుపుతున్నప్పుడు మాట్లాడటం... వీడిదేం పోయింది! వీడికి ఏదన్నా అయితే తల్లిదండ్రులు బాధపడతారు" పెద్దగా అరుస్తూ కారుడోర్ తీసుకుని బయటకు వస్తూ అన్నాడు కారు ఓనరు.

అనీష్‌కు బాగా గాయాలయ్యాయి. మొహం డోక్కుపోయి పచ్చడి అయ్యింది. వీపు వెనుకభాగం ఎముకలు విరిగాయి. మొహం, చేతులమీద రక్తం మరకలతో భయంకరంగా కన్పించేడు ఆమెకు. కొన్ని క్షణాల ముందు రాకుమారుడిలా కన్పించేడు. ఇప్పుడేమో అతనివైపు చూడాలంటేనే ఆ అమ్మాయికి భయమేసింది. ఆ అమ్మాయికేం దెబ్బలు తగల్లేదు.

కారతనే అనీష్‌ను హాస్పిటల్లో చేర్పించాడు.

నెలరోజులు హాస్పిటల్లో ఉండాల్సి వొచ్చింది. రెండు మూడుసార్లు వసుధ హాస్పిటల్‌కు వొచ్చి చూసివెళ్ళింది.

డిచ్చార్జ్ చేసిన కొడుకును ఇంటికి తీసుకువెళ్ళాడు రాఘవ. రెండు నెలలు వెళ్ళకపోవడంతో చేస్తున్న ఉద్యోగంపోయింది.

"నువ్వు బి.టెక్ చదివావు.... మూడేళ్ళ అనుభవం సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా వుంది. కళ్ళుమూసుకుని నీకు మరో కంపెనీవాళ్ళు ఇస్తాడు. దిగులు పడకు!"

తండ్రి ధైర్యం చెప్పాడు.

అతను బాధపడుతున్నది ఉద్యోగం పోయినందుకు, యాక్సిడెంట్‌లో బలమైన గాయాలు తగిలినందుకు కాదు, వసుధ రాకపోకలు తగ్గించినందుకు.

సెల్‌ఫోన్‌లో కూడా మాట్లాడటానికి ఇష్టపడకపోవడం, మాట్లాడినా క్లుప్తంగా మాట్లాడటం అతన్ని మరింత దిగులుపడేటట్లు చేసింది.

అతని పరిస్థితి అనసూయ గ్రహించింది.

"అనుకోకుండా ప్రేమికుడికి ఇబ్బందులు ఎదురైనప్పుడు అతని ప్రేయసి అతనిపై మునుపటి ప్రేమను, నమ్మకాన్ని ఉంచాలి.... దూరంగా, జరిగిపోకూడదు. ప్రేమ తడి ఎప్పుడూ ఆరిపోకూడదు. అమృతం జల్లు నిరంతరం కురిపించాలి" అంది అనసూయ కొడుకు నుదుటిపై చెయ్యివేసి ఆప్యాయంగా నిమురుతూ.

ప్రేమ గులాబీకోసం ఆరాటపడేటప్పుడు ఆ గులాబీ ప్రక్కన ముళ్లు వుంటాయని గ్రహించాలి. గుండెకు గాయాలవుతాయి. కాలమే ఆ గాయాలకు లేపనం పూస్తుంది...

❖ ❖ ❖

అనుకోని మలుపు తిరిగింది.

అనసూయకు తరుచూ జ్వరం రావడం మొదలయ్యింది. గొంతు బొంగురం పోయింది. ఎడతెరిపి లేకుండా దగ్గువొస్తూ వుంది.

కామినేని హాస్పిటల్‌కు తీసుకువెళ్ళి పరీక్షలు చేస్తే ఆమెకు క్యాన్సరు వొచ్చిందని చెప్పారు డాక్టర్లు.

బ్రెస్ట్ క్యాన్సర్ వొచ్చింది. ఆపరేషన్‌చేసి బ్రెస్ట్ తీసేశారు. క్యాన్సరు వొచ్చిందని ఆమె అధైర్యపడలేదు. ఆపరేషన్ జరిగేక కోలుకుని తన పనులు తను చేసుకుంటూ వుంది.

ఆమె విషయంలో విధి వక్రించింది.

మళ్ళీ క్యాన్సర్ సెల్స్ విజృంభించేయి. కెమోథెరపీ చేశారు. రెండు డోసులకే ఆమె క్రుంగిపోయింది. మొదటిసారి క్యాన్సర్ వొచ్చినప్పుడు ఎంతో మనోనిబ్బరంతో వుంది కాని రెండోసారి సోకినప్పుడు మనిషి డీలాపడిపోయి ఏడ్చేసింది.

"ఈసారితప్పదు... మిమ్మల్ని విడిచిపోక తప్పదు" అంది అనసూయ కన్నీళ్ళు కారుస్తూ.

ఆమెను పొదిని పట్టుకున్నాడు రాఘవ.

"నువ్వేం అధైర్యపడకే! క్యాన్సర్ చికిత్సకు మంచి మందులు వొచ్చాయి. ఎన్ని లక్షలైనా ఖర్చుపెట్టి నిన్ను బ్రతికించుకుంటాను. ఇల్లు అమ్మేసి ఎంత ఖర్చయినా భరిస్తాను. నా సర్వశక్తులు వొడ్డి నిన్ను బ్రతికించుకుంటాడు. నిన్ను తేలిగ్గా జారవిడ్చుకోలేను. నువ్వు నాకు తోడుగా చివరి క్షణాలవరకూ ఉండాలి!" అన్నాడు రాఘవ స్థిరస్వరంతో.

అతని తల్లోకి వ్రేళ్ళు పోనిచ్చి తలనిమిరిందామె.

"నేను చనిపోతున్నందుకు నాకేం విచారంలేదు. మిమ్మల్ని ఒంటరిగా ఎలా ఒదిలి వెళ్ళాలన్నదే నా బాధ... దీపంలా మనిద్దరి అనురాగబంధం వెలుగుతూ వుంది. మీరు నూనె అయితే నేను ఒత్తిని. ఒత్తి మలిగి మునిగిపోయినప్పుడు నూనె దిగులుపడుతుందనే నా బాధ" అందామె నీరసంగా.

ఉద్వేగంతో తల్లిని దగ్గరకు తీసుకుంటున్న తండ్రిని చూశాడు అనీష్.

వాళ్ళిద్దరూ కొత్తగా కన్పించేరు ఆ క్షణంలో. వాళ్ళిద్దరి మధ్య అంత అనురాగం, ఆప్యాయతలు ఉన్నాయా? వాళ్ళిద్దరి పటిష్టమైన అనురాగ బంధాన్ని తనెందుకు గమనించలేకపోయాడు?... నిజమైన ప్రేమ అదేనేమో!...

ఒక్క క్షణం కూడా నాన్న అమ్మని ఒదిలి ఉండటం లేదు. భార్యకు సపర్యలు చేస్తూనే వున్నాడు.

అనసూయ కోలుకుంటూ వుంది.

డాక్టరు కూడా ఆశ్చర్యం వ్యక్తపరిచాడు... "మీ అమ్మ బాడీలో గ్రేడు త్రీక్యాన్సర్ సెల్స్ ఉన్నాయి. బ్రతకడం కష్టమనుకున్నాను. కానీ షి ఈజ్ షోయింగ్ సైన్స్ ఆఫ్ ఇంప్రూవ్‌మెంట్.... ట్రీట్‌మెంటుకు బాగా రెస్పాండ్ అవుతుంది. షి ఈజ్ అవుటాఫ్ డేంజర్!" అన్నారాయన అనీష్‌తో.

"నాన్న ప్రక్కన ఉండాలనే అమ్మ సంకల్పబలం అమ్మని కాపాడింది' అనుకున్నాడు అనీష్ మనస్సులో.

❖ ❖ ❖

"అమ్మకు క్యాన్సర్ వొచ్చింది. చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతుంది" అప్పుడెప్పుడో వసుధకు మెసేజ్ పంపించాడు అనీష్.

ఆ మెసేజ్ చూసుకుని అమ్మనుచూడటానికి వొస్తుందనుకున్నాడు. కానీ ఆమె రాలేదు. వసుధ గూర్చి ఆలోచించడం మానేశాడు.

మరో కంపెనీలో మంచి ఉద్యోగం దొరికింది. జీతం నెలకు ఎనభైవేలు. "అమ్మ పూర్తిగా కోలుకుంది"... అదే అతనికి సంతోషం కల్గిస్తున్న విషయం.

ఇప్పుడతనికి ఒకటే లక్ష్యం... అమ్మను కంటికి రెప్పలా చూసుకునే అమ్మాయినే భార్యగా ఎంటక చేసుకోవాలి.

"వేలెంటైన్స్‌డే' రోజు గిఫ్టుగా లవ్ బ్యాంగ్స్, ప్లాటినం నగ కోరుకునే ప్రేయసి కాదు తనకు లైఫ్‌పార్టనర్‌గా వొచ్చేది. చెరగనిప్రేమకు చిహ్నంగా చేమంతిపువ్వు ఇచ్చినా సంతోషం వ్యక్తపరిచే చిన్నది తనకు లైఫ్ పార్టనర్‌గా రావాలి!" అనుకున్నాడతను మనస్సులో దృఢంగా.

కష్టసుఖాలలో తోడునీడగా నిలిచే మగువే మగవానికి మధుర భావన.

**- ఆదివారం ఆంధ్రభూమి, 7 ఆగష్టు 2011**